అంతరాత్మ దర్శనం

వాస్తవ ప్రపంచం (the material world) లో తప్పు చేసేవాడొకడు, దాని మూలంగా బాధపడేవాడొకడు, దాని గురించి ఫిర్యాదిచ్చేవాడొకడు, బంధించి తీసుకెళ్ళేవాడొకడు, కాపలాకాసేవాడొకడు, బోనులో నిలబెట్టేవాడొకడు, ప్రశ్నలడిగేవాడొకడు, సాక్ష్యం చెప్పేవాడొకడు, తీర్పిచ్చేవాడొకడు, దాన్ని అమలు జరిపేవాడొకడు - అని ఇంతమంది ఉంటారు.

అంతిమ సత్య ప్రపంచం (the world of ultimate truth) లో మాత్రం ఇంతమంది ఉండరు. అక్కడ నీకు నువ్వే ముద్దాయివి. నీకు నువ్వే బాధితుడివి. నీకు నువ్వే ఫిర్యాదీవి. నీకు నువ్వే రక్షకభటుడివి. నీకు నువ్వే చెఱసాల అధికారివి. నీకు నువ్వే పబ్లిక్ ప్రాసిక్యూటరువి. నీకు నీకు నువ్వే డిఫెన్స్ లాయరువి. నీకు నువ్వే సాక్షివి. నీకు నువ్వే న్యాయమూర్తివి. అక్కడ నువ్వు తప్ప నీకింకెవ్వరూ కనిపించరు. అదొక ఒంటరి లోకం.

అందుచేత అది ప్రపంచంలోకెల్లా అత్యంత క్రూరమైన న్యాయస్థానం. నూటికి 99.99 శాతం మంది మనుషులు (మనస్సులు) దాన్ని face చెయ్యలేరు. జరిగిన సంఘటనల తాలూకు గుప్తమైన స్మృతులు చిత్రాలు (దృశ్యాలు) గా మనస్సు యొక్క లోలోపలి పొఱల్లో నుంచి సర్వసమగ్రంగా వెలికి తియ్యబడతాయి. ఆ గుప్తమైన చిత్రాలు (సంఘటనలు) గుర్తుకు రావ డానికి చిత్రగుప్తుడని పేరు.

దేవుడు లేడనవచ్చు. శాస్త్రాలు అబద్ధమనవచ్చు. మతాలు కుట్ర అనవచ్చు. కాని తానున్నాడు. తాను అబద్ధం కాదు. తాను కుట్ర కాదు. తాను నిజం. అందుకే చేశాడు పరమాత్ముడా ఏర్పాటు. ఆ ఒంటరి నిర్జన న్యాయస్థానం. అక్కడ న్యాయ సూత్రాలంటూ ఏమీ ఉండవు. నీకు నువ్వేర్పఱచుకున్న చట్టం ప్రకారమే నువ్వు విచారించబడతావు. నువ్వు గతంలో ఇతరులకు చెప్పిన నీతుల్ని బట్టి నువ్వు కూడా విచారించబడతావు. నువ్వు బతికుండగా ఎంత పండితుడివైతే అంత నిర్దా క్షిణ్యంగా ఉంటుంది నీమీద జరగబోయే విచారణ. నిన్ను నువ్వే దర్యాప్తు చేస్తావు. కర్కశంగా దర్యాప్తు చేస్తావు.

నువ్వంటే నువ్వు కావు. నీలో ఉన్న నీ అంతరాత్మ చేస్తుంది. ఈ మాట తఱచుగా చాలామంది వాడగా వింటూ ఉంటాం. అదేంటో తెలిసినా తెలియకపోయినా"ఏదో కర్ణాకర్ణిగా చూచాయగా విన్నాం గదా" అని ఎడాపెడా అలవోకగా వాడేసేవాళ్ళు ఎక్కువ. వేఱువేఱు కలనయంత్రాల్ని కలిపే అంతర్జాలంలా వేఱువేఱు మనుషుల్ని కలిపేది అంతరాత్మ. అందుకే దానికి ఆ పక్షపాత రహిత ధోరణి. ఆ నిఃస్వార్థం. అది ప్రపంచానికి నిజమైన ప్రభుత్వం. అది తప్పొప్పుల విచారణలో బహుక్రూరమైనది. మానవమనస్సులా అది తన్ను తాను మోసం చేసుకోదు. మానవ మనస్సు మొద్దబ్బాయిలాంటిది. తప్పించుకోవడానికి అడ్డదార్లు వెతికే ఖైదీలాంటిదది. దేవుడికే లంచమిద్దామని ఆలోచిస్తుందది. లంచమిచ్చి శిక్ష మాఫీ చేయించుకుందామని పథకాలు వేస్తుందది. కాని ఆ న్యాయమూర్తి (అంతరాత్మ) లంచం తీసుకోడు. తనకు లంచంగా ఇవ్వజూపినవాటిని భద్రంగా దాచిపెట్టి శిక్షాకాలం పూర్తయ్యాక ఖైదీకే వడ్డీతో సహా అప్పగిస్తాడు. వీటికి వేఱువేఱు ఖాతాలు నిర్వహించబడతాయి. ఒక ఖాతా ప్రాతిపదిక మీద ఇంకో ఖాతా రద్దయ్యే ప్రసక్తి లేదు. ఆ అంతరాత్మ ఎవరో కాదు, స్వయంగా నువ్వే. అక్షరాలా నువ్వే. ముమ్మూర్తులా నువ్వే. కాని లక్షలాదిమంది ఈ సత్యాన్ని తాము బతికుండగా గ్రహించజాలరు.

ఇదొక పార్శ్వం.

ఒకవేళ బతికుండగానే గ్రహించగలిగితే ? అది అసంభవం కాదు. కాని నూటికో కోటికో ఒక్కరు మాత్రమే ఉంటారు అలాంటివాళ్ళు. వాళ్ళకు అంతరాత్మ గ్రాంథిక భావన (bookish concept) కాదు. కాలూ చెయ్యీ ఉండడం ఎంత నిజమో అంతే వాస్తవంగా వాళ్ళు దాన్ని అనుభవిస్తారు.

సాధారణంగా మోక్షం పొందడానికి ఇంకా కొద్దిజన్మలు మాత్రమే మిగిలి ఉన్నాయనగా అంతరాత్మదర్శనం కలుగుతుంది. అంతరాత్మ దర్శనమిచ్చినప్పుడు మనిషి దిగ్భ్రాంతి చెందుతాడు. ఎందుకంటే ఆ మహా మహనీయ తేజోమయమూర్తి అచ్చం తనలాగానే ఉండడం, తనకంటే అందంగా ఉండడం, తనలో లేని తేజస్సూ, పరమప్రశాంతి, ప్రేమా, దయా, వాత్సల్యమూ ఆ మూర్తిలో ఉండడం. ఆ సమయంలో తాను ఏ దుస్తులు ధరించి ఉన్నాడో అదే విధమైన దుస్తులు అంతరాత్మ కూడా ధరించి ఉండడం. ఆ భగవత్ స్వరూపం తానే అని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ తాను అంత గొప్పవాణ్ణి కాను గదా ! అనే శంక వల్ల దిగ్భ్రాంతి చెందుతాడు.

ఆ దర్శనం ముగిసి అంతరాత్మ తిరిగి తనలో లీనమయ్యాక మానవుడు దుఃఖిస్తాడు. "లక్షల కోట్లాది సంవత్సరాల వయసు గల ఆ సనాతన ధర్మమూర్తి నువ్వేనా స్వామీ ? నువ్వు అసలు లేనేలేవనుకున్నాను ఇంతకాలమూ ! కృష్ణుడు రాముడు అల్లా జీసస్ అంతా బోగస్ అనుకున్నాను స్వామీ ! నిన్నిక్కడే పెట్టుకుని ఎక్కడెక్కడో వెతుకుతున్నాను ! నాలోనే ఉండి నాతో పాటే నా కష్టాలూ సుఖాలూ రోగాలూ రొష్టులూ యాక్సిడెంట్లూ నువ్వు కూడా అనుభవిస్తున్నావని తెలుసుకోలేకపోయాను స్వామీ ! నాకు నువ్వుంటే చాలు, ఎన్ని నరకాలైనా ఆనందంగా అనుభవిస్తానయ్యా !"అనేస్తాడు. పాపాలకు పడే శిక్షల నుంచి తప్పించుకుందామనే ఆలోచన శాశ్వతంగా అంతరించిపోతుంది. తండ్రిమాట మీద బడికి వెళ్ళడానికి సిద్ధమయ్యే బుజ్జి కొడుకులాగా తప్పులకు శిక్ష అనుభవించడానికి మానవుడు ఆనందంగా సిద్ధపడతాడు. ఈ దర్శనంతో- క్రూరమైన, ఒంటరి, నిర్మానుష్య న్యాయస్థానం అనుకున్నది కాస్తా హఠాత్తుగా నాన్నగారి ఆఫీసుగదిలా మారిపోతుంది. ఇది ఇంకో పార్శ్వం.

అలా ఒక్క దర్శనంతో అన్నీ పటాపంచలు. అది కలిగాక వెయ్యి నాస్తిక గ్రంథాలు చదివినా ఏ మార్పూ ఉండదు. లక్షమంది నాస్తికుల మధ్య ఉన్నా ప్రభావం ఉండదు. అందరిలోను తానే కనిపిస్తాడు. లోకమంతా హఠాత్తుగా దేవాలయంలా మారిపోతుంది. ఆ స్థితిలో మనిషి మెయిన్ రోడ్డు మీద పడి అందరికీ సాష్టాంగ నమస్కారాలు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. అంతా అంతరాత్మే, స్కూటర్లూ, కార్లూ బస్సులతో సహా, మనుషులంతా నావాళ్ళే, అంతా నేనే అనిపిస్తుంది. ఆ స్థితిలో అతడు తనని తానే పూజించుకునే సంభావ్యత కూడా ఉంది.

--తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం (2007)

http://www.tadepally.com

ఎవరి చావు వారు చస్తే తప్పేంటి ?

2006 లో మన దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నవారి సంఖ్య 1,18,112 అని జాతీయ నేర నమోదుల విభాగం (National Crime Records Bureau) ఒక నివేదిక లో పేర్కొంది. వీరిలో 35 శాతం మంది విషం తీసుకుని తనువు చాలించారు. 32 శాతం మంది ఉరేసుకుని తుదిశ్వాస విడిచారు. షుమారు 9 శాతం మంది ఒంటికి నిప్పంటించుకుని ఆహుతయ్యారు. తక్కినవారు అనేక ఇతరేతర పద్ధతుల్లో ఈ లోకాన్ని విడిచివెళ్ళారు. 26 శాతం మంది గృహచ్ఛిద్రాల కారణంగాను, 22 శాతం మంది ఆరోగ్య సమస్యల మూలంగాను, మూడున్నర శాతం మంది ప్రేమవైఫల్యాల వల్లా, మఱో ఐదు శాతం మంది వెనకబాటు, పేదఱికం మొదలైన కారణాల వల్లా ఆత్మహత్య చేసుకున్నారని తెలుస్తోంది.

ప్రోద్బలం ఏదైనప్పటికీ ఆత్మహత్యని ప్రభుత్వాలు నేరంగా పరిగణిస్తాయి. ఏ నేరప్రవృత్తి అయినా సర్వసాధారణ మానసిక స్థితి కాదు. అది కొద్దిమంది మాత్రమే గుర్తించగల మానసిక వైకల్యం. దానికి కొన్నిసార్లు నిపుణుల చికిత్సతో గుణం కనిపిస్తుంది. కొన్నిసార్లు కనిపించదు. కొన్నిసార్లు గుణం తాత్కాలికమే. దీనిక్కారణం సరిగా తెలియదు. ఒకానొక వ్యక్తి యొక్క మనోవైకల్యం తనకు తాను హాని చేసుకునే రూపంలో బయటపడ్డాక నేరాభియోగం మోపక తప్పదు. నేరాలకు దారితీసే అన్ని మనోవైకల్యాల్లాగానే దాన్ని చూడక తప్పదు.

అన్ని మతాలూ ఆత్మహత్యని పాపంగా పేర్కొని నిర్ద్వంద్వంగా నిషేధించాయి. హిందూమతం, క్రైస్తవ్యం, ఇస్లామ్ వంటి ఆస్తిక మతాలే కాక జైనం బౌద్ధం వంటి నాస్తికమతాలు కూడా ఆత్మహత్యని తీవ్రంగా ఖండించాయి. ఏ మతాన్నీ నమ్మక సర్వసంప్రదాయ విరుద్ధమైన పాషండమార్గంలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించిన ప్రపంచ ప్రఖ్యాత నాస్తిక తత్త్వవేత్తలు కీ.శే.జిడ్డు కృష్ణమూర్తి, ఉప్పలూరివంటివారు కూడా ఆత్మహత్యని పదేపదే గర్హించారు. ఒక శస్త్రచికిత్స సందర్భంగా తనకు వృద్ధాప్యంలో కలిగిన దివ్యానుభవంతో శ్రీ జిడ్డు మరణానంతర జీవితాన్ని అంగీకరించారు. కాని ఆత్మహత్య ఎందుకు మంచిది కాదో ఎప్పుడూ వివరించలేదు. ఏదో సందర్భంలో "మనిషికి ఇంకేంటి దిక్కు, ఆత్మహత్య తప్ప ?" అన్న శిష్యుడితో వివేకానంద స్వామి "అందుమూలంగా ఇంకా కీడు మూడుతుంది.అలాంటి ఆలోచనలే చెయ్యవద్దు." అని హెచ్చరించారు.

ఎవరి బతుకు వారు బతకడానికి ఉన్న హక్కు ఎవరి చావు వారు చావడానికి లేదా ? ఎవరి శరీరం వారిది. దానికి వారు అన్నం పెట్టుకుంటారు.మానుకుంటారు. కావలిస్తే చంపుకుంటారు.మనకెందుకు ? మతాల కెందుకు ? మతగురువుల కెందుకు ? ప్రభుత్వాల కెందుకు ? అని ప్రశ్నిస్తే చాలా విషయాలు ప్రస్తావన కొస్తాయి.

అసలు "ఎవడి బతుకు వాడి"దనే ఈ తప్పుడు సిద్ధాంతం రెండో ప్రపంచయుద్ధం తరువాత కట్టుతప్పిన అమెరికన్లు ప్రపంచం మీద ప్రయోగించిన మరో మారణాస్త్రమే తప్ప అంతకుముందు చరిత్రలో ఎవరూ దీన్ని అంగీకరించలేదు. దీన్ని బాగా భుజానికెత్తుకుని ప్రచారంలోకి తెచ్చిన సంఘవ్యతిరేకశక్తుల్లో ఫెమినిస్టులు ప్రముఖులు. అమెరికన్లకు సమాజం నుంచి అన్నీ కావాలి. సమాజాన్ని తమ అవసరాల కోసం పీల్చిపిప్పిచెయ్యాలి. కాని తమ వ్యక్తిగత జీవితంలో మాత్రం ఎవరూ జోక్యం చేసుకో కూడదు. ఇది అక్కడ ఎంతగా ముదిరి కుళ్ళి పుచ్చిపోయిందంటే అక్కడ భార్యాభర్తలక్కూడా ఎవరి వ్యక్తిగతాలు వాళ్ళ కున్నాయి. కుటుంబసభ్యులు పరస్పరం తప్పనిసరిగా పోషించాల్సిన సలహాదారు పాత్రని సైతం కోల్పోయారు. అదో గొప్పలాగా

చెప్పుకుంటారు వాళ్ళు. పాపం ! వాళ్ళు చాలా అడ్వాన్సుడు. మనమందఱం వెధవాయిలం. కొన్నిసార్లు ఆలోచిస్తే ఈ సిద్ధాంతం మూలంగా యూరోపు పాడైనట్లు అమెరికా పాడుకాలేదనే అనిపిస్తుంది. "There's no society. There are only individuals" అన్న మార్గరెట్ థాచర్ (మాజీ యు.కె. ప్రధానమంత్రిణి) మాటలు గుర్తు తెచ్చుకోండి.

ఇది నిజమేనా ? ఎవడి బతుకు వాడిదేనా ? మనిషికి తన జీవితం మీద అంతులేని స్వయంనిర్ణయాధికారం నిజంగానే ఉందా ?

ముందు అర్థం చేసుకోవలసింది ఇది.నీకు ఒకదానిమీద స్వతస్సిద్ధమైన అధికారం ఏర్పడాలంటే నీ సొంత సంకల్పబలంతో, నీ ప్రతిభతో, నీ వనరులతో నువ్వు దాన్ని నిర్మించి ఉండాలి. మానవుడి జీవితం అలా మొదలైందా ? నీ పుట్టుక నీ తల్లిదండ్రుల జీవితంలో జఱిగిన ఒక యాక్సిడెంటు. వాళ్ళు కూడా నీ పుట్టుకకు ముందస్తుగా ప్రణాళిక రచించి ఉండలేదు. నువ్వెవరో వాళ్ళకు తెలియదు. వాళ్ళెవరో నీకు తెలియదు. పుట్టాక మీరు ముగ్గుఱూ పరిచయమయ్యారు. నీ పుట్టుక నీ సంకల్పంతో జఱిగింది కూడా కాదు. అది నీకు స్పష్టంగా తెలుసు. నీకు అంత తెలివితేటలున్నాయా ? నీ పళ్ళు తోముకునే పళ్ళపొడి కూడా నువ్వు తయారుచేసుకోలేవు. అది కూడా వేఱే ఎవడో తయారుచేసి నీకు అమ్మాలి. ఇంక ఏకంగా శరీరాన్నే నిర్మించుకోవడమా ? అన్నన్నా ! ఎంతమాట ? నీ సంకల్పంతో ఏదైనా అయ్యేదుంటే ఇలా ఎందుకు పుట్టడం ? సూపర్‌మ్యాన్‌లాగా పుడతావు. బాల్యం అవసరం లేకుండానే ఏకంగా యౌవనవంతుడుగానే పుడతావు. ముసలితనమూ చావూ లేని జీవితాన్నే నిర్మించుకో గలుగుతావు. ఉక్కుతునక లాంటి వజ్రదేహాన్నే నిర్మించుకుంటావు.మఱేది ? ఏది నాయనా ! చెప్పు, ఎక్కడుంది నీకు స్వేచ్ఛ ?

కనుక ఈ శరీరం నీది కాదు. ఈ ప్రపంచం కూడా నీది కాదు. “నీది” అనుకుంటున్నదేదీ నీది కాదు. నువ్వు పుట్టకముందే ఈ ప్రపంచం ఉంది. నువ్వు మరణించాక కూడా ఇది ఉంటుంది. వీటన్నింటికీ సుప్రీమ్‌బాస్ వేఱే ఒకడున్నాడు. వాడికి దేనితోను సంబంధం లేదు. కాని వాడిది ఉక్కుపిడికిలి, ఉడుంపట్టు. వాడి ఆగ్రహమూ, అనుగ్రహమూ రెండూ ప్రచండమైనవే. నీ శరీరమూ, నీ జీవితమూ వాడి ఆస్తి అయివుండగా దాన్ని వాడి అనుమతి లేకుండా ధ్వంసంచేసే హక్కు నీకెవరిచ్చారు ? నీ శరీరం ఒక అద్దెకొంప. దానికి నువ్వు చెల్లించాల్సిన అద్దె - దాని యజమానిని రోజూ తల్చుకోవడమే. కిరాయిదారు తన ఇంటిని బాంబులు పెట్టి పేలుస్తానంటే యజమాని ఒప్పుకుంటాడా ? అక్షరాలు దిద్దుకోమని రాసిచ్చిన పలకని నేలకేసి పగలగొడితే తండ్రి ఊరు కుంటాడా ? లెక్కలు చెయ్యమని ఇచ్చిన హోంవర్క్ పుస్తకాన్ని చింపి చిధ్రుపలు చేస్తే పంతులుగారు ఊరుకుంటాడా ? “నా యిల్లు నా యిష్టం, నా పలక నాయిష్టం, నా నోట్‌పుస్తకం నా యిష్టం” అని వాదించగలవా ?

భగవంతుడు తన సృష్టిలో మనిషికి స్వేచ్ఛ అంటూ అనుమతించి ఉంటే అది అత్యంత పరిమితం. ఒక రాటకు కన్నెత్రాటితో ఒక ఆవుని కట్టేసినప్పుడు ఆ తాడు ఎంత వ్యాసార్థాన్ని (radius) ఏర్పఱచగలదో అంత పరిధి (range) లో మాత్రమే ఆ ఆవు మెయ్యగలదు. మనిషికి దేవుడిచ్చిన స్వేచ్ఛ ఇలాంటిది. కాని మనిషి గొప్పతనమేమిటంటే ఈ కొద్దిపాటి స్వేచ్ఛతోనే అంతులేని పాపాలు చెయ్యగలగడం.

దానవుడౌతాడు మనిషి దైవాన్నను కున్నప్పుడు.

❖ ❖ ❖ ❖ ❖ ❖

ప్రతిదానికీ శివ సంకల్పమస్తు ? కురువపురం (కర్ణాటక) వెళ్ళినప్పుడు అక్కడొక పెద్దాయన తారసపడి "శివుడి ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు గదా ? కానున్నది కాక మానదు గదా ?" అని అడిగాడు. అప్పటికి నాకు తోచిన సమాధానమేదో చెప్పాను. చాలామంది ఇలాగే అనుకుంటారు. మనిషి చేతిలో ఏమీ లేదు కనుక మనిషి చేసే వెధవ పనులకు అతని బాధ్యత ఏమీ లేదని, వాటిని దేవుడికో, గురువుగారికో, ప్రకృతికో, కాలానికో, దేశానికో అంటగట్టే ప్రయత్నం చేస్తారు. లేదా ఆ స్థానంలో ఎవరుంటే వారికి అంటగడతారు. ఇంతకుముందే అనుకున్నట్లు మనిషికి దేవుడు కొంతలో కొంత స్వేచ్ఛ ఇవ్వకపోలేదు. అది కూడా ఇచ్చి ఉండేవాడు కాడు. కాని మోక్షం సంపాదించుకోవాలంటే ముందు జ్ఞానాన్ని ఆర్జించుకోవాలి కనుకా, స్వేచ్ఛ లేకపోతే జ్ఞానానికి అర్థం లేదు కనుకా ఆ మాత్రం ఇవ్వక తప్పదని భావించి ఇవ్వడం జరిగింది.

ఒక మనిషి ఆత్మహత్య చేసుకుంటాడని సర్వజ్ఞుడైన దేవుడికి ముందే తెలియదా ? అటువంటప్పుడు మనిషి బాధ్యత ఏమిటి ? అందుకు అతన్ని పాపిని చేసి మాట్లాడ్డమేంటి ? అని కొందఅనుకుంటారు. మానవ జీవితంలో జరిగే ప్రతి చిన్న సంఘటనకూ గ్రహగతులతో ఉన్న సన్నిహిత సంబంధాన్ని సూక్ష్మంగా సాహసోపేతంగా పరిశోధించి నమోదు చేసిన భారతీయ జ్యోతిశ్శాస్త్రం అత్మహత్యల దగ్గఱికొచ్చేసరికి చప్పగా చతికిలబడింది. ప్రతి మహాయోగానికీ దుర్యోగానికీ వందలాది గ్రహసంయోగాల్ని పేర్కొన్న జ్యోతిశ్శాస్త్రం ఆత్మహత్యకు సంబంధించి మాత్రం నీళ్ళు నములుతూ కేవలం రెండు- మూడు గ్రహసంయోగాల్ని ఉదాహరించగలిగింది.

మనిషి పుట్టకముందే దేవుడు రాసే నొసటిరాత గుఱించి మాత్రమే జ్యోతిశ్శాస్త్రం మాట్లాడగలదు. ఆ రాతలో లేనిది జాతకంలో కనిపించదు. ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళల్లో నూటికి 99 మంది జాతకాల్లో ఆత్మహత్య సూచించబడదు. జాతకాల్లో గండాలు ఉంటాయి. ప్రమాదాలు ఉంటాయి. అంతే తప్ప ఆత్మహత్యలు ఉండవు. "వో ! భూలోకంలో పుట్టి ఆత్మహత్య చేసుకో. నా ఆగ్రహానికి బలైపో" అని ఎవరికీ నొసటిరాత రాయడు దేవుడు. అలా రాసేవాణ్ణి మనం దేవుడు అనం. ఆత్మహత్య అనేది మనిషి తనకివ్వబడిన స్వేచ్ఛని దుర్వినియోగపఱుస్తూ దైవాన్ని ఎదిరిస్తూ తన యొక్క ఆకస్మికమైన స్వసంకల్పంతో కర్మ ఫలంపై తీసుకునే నిషిద్ధమైన చనువు. సదరు చర్య దేవుడి ఊహకు సైతం అందనటువంటిదని గమనించాలి. "ఇలా రాశాను గదా ! ఇలాగే ఉంటాడులే !"అనుకుంటాడాయన. పసిబిడ్డ హృదయం గల భగవంతుడు అలుపూ-సొలుపూ లేని ఆశావాది. మనుషులు ఎంతగా పతనమౌతున్నా వీళ్ళంతా ఏదో ఒకరోజు బాగుపడతారనే ఆశతో ఆయన పనిచేస్తూంటాడు. కొద్దిమంది కొద్దిగా కొద్దిసేపు బాగుపడ్డా సరే ! ఆ అల్పసంతోషి దానితోనే అనల్పంగా సంతృప్తి చెందుతూ వాళ్ళ కోరికలు తీఱుస్తూ ఎదురు చూస్తాడు.

అయితే ఆత్మహత్యా ధోరణి గల వ్యక్తుల్ని ముందుగా పసిగట్టలేమా ? ఆత్మహత్య ఒక మనస్తత్త్వం ఏమీ కాదు.అదొక క్షణిక ప్రేరణ. అత్యంత ప్రమాదకరమైన ఆ ప్రేరణ జీవితంలో ఏ కాలఖండంలో తలెత్తే అవకాశం ఉందో మనం తెలుసుకోవచ్చు. ఆత్మహత్యకు సంబంధించి జ్యోతిశ్శాస్త్రం ఒకటి- రెండు విషయాలు గుర్తించింది.1. అన్ని ఆత్మహత్యల వెనుకా శని గాని రాహువు గాని ఉన్నారు. అంటే సాధారణంగా ఈ రెండు గ్రహాల యొక్క ప్రతికూల మహాదశల్లో గాని, అంతర్దశల్లో గాని, గోచారంలో గాని ఆత్మహత్యా సంకల్పం కలుగుతుంది. కాని అంతమాత్రాన ఆత్మహత్య ఖచ్చితంగా చోటు చేసుకుంటుందని చెప్పలేము. 2. నీచ లో పడి వక్రించకుండా ఉన్న గ్రహాల దశాభుక్తుల్లోను, పాపార్గళం పట్టిన గ్రహాల దశాభుక్తుల్లో కూడా ఆత్మహత్యా సంకల్పం కలిగే అవకాశముంది. అవి శుభగ్రహాలైనా సరే !

ఆత్మహత్యకు ప్రేరేపించడంలో శని బలీయుడు. అఖండంగా యోగించే శనిదశలో కూడా మనిషికి మానసికంగా డిప్రెషన్ వస్తుందంటే ఇక శని సామర్థ్యం ఎలాంటిదో ఊహించండి. ఆత్మహత్యకు ఈ డిప్రెషనే కారణం. ఆత్మహత్యకు సంబంధించి జ్యోతిశ్శాస్త్రం రెండు- మూడు యోగాల్ని పేర్కొంది.

1. పుట్టినప్పుడు జరుగుతూ ఉన్న దశ ఏ గ్రహానికి సంబంధించిందో ఆ గ్రహం ఆ మనిషి జాతకంలో శనితో కలిసి ఉంటే ఆ మనిషి ఆత్మ హత్య చేసుకునే అవకాశం గాని ఇతరులచేత చంపబడే అవకాశం గాని ఉంది. (ఖచ్చితంగా చెప్పలేదు)

2. లగ్నాధిపతి ఇలా ఉన్నా కూడా ఇదే ఫలితం.

3. ఈ గ్రహాలే జన్మలగ్నం నుంచి పన్నెండో స్థానంలో పడ్డా కూడా ఇదే ఫలితం.

4. ఈ గ్రహాలే రాహుకేతువులతో కలిసి జన్మలగ్నం నుంచి పన్నెండో ఇంట్లో ఉంటే జాతకుడు ఉరేసుకుని చనిపోతాడు. (ఖచ్చితంగా చెప్పబడింది)

ఆత్మహత్యకు దారితీసే దుర్యోగాల్లో పిశాచగ్రస్తయోగం కూడా ఒకటిగా చెప్పబడింది. అంటే జన్మలగ్నంలో రాహు చంద్రులు కలిసి ఉండడం. ఇలాంటి కేసులు రెండు తగిలాయి. సదరు వ్యక్తులకు పిశాచం ఆవహించడం మూలంగా మతిస్థిమితం తప్పింది గాని ఆత్మహత్య చేసుకోవడమైతే జరగలేదు. కాని అలాంటివాళ్ళు ఎప్పటికీ చేసుకోరని ఖచ్చితంగా చెప్పలేం. ఈ దుర్యోగం గుఱించి విపులంగా రాయడానికి ఇది తగుచోటు కాదు. వేఱే వ్యాసపరంపరలో రాస్తాను.

బహుకాల పరిశోధనల తరువాత హత్యలూ, ఆత్మహత్యలూ, దొంగతనాలూ, దాడులూ, ద్రోహాలూ లేదా అలాంటి విషాదాలు (tragedies) సాధారణంగా 4 మఱియు 8 అనే అంకెలకు సంబంధించినవని గుర్తించబడింది. అంటే ఇవి ఏకాంతిక (stand-alone) సంఖ్యలుగా ఉన్నప్పుడు లేదా ఒక సంఖ్యలోని అంకెల మొత్తం 4 గానీ 8 గానీ అయినప్పుడు మాత్రమే ప్రమాదకరంగా పరిణమిస్తాయి. అంతేతప్ప ఒక పెద్దసంఖ్యలో భాగంగా నాలుగో, ఎనిమిదో ఉన్నంతమాత్రంచేత కొంపలేమీ మునగవు. వీటిల్లో మొదటిది (4) రాహువుకు సంబంధించిన అంకె. రెండోది (8) శనికి సంబంధించినది.వీటి ఆకారమే ఉరిపోసుకున్నట్లు ఉండడం గమనార్హం. శనివద్ రాహుః (రాహువు, శని వలెనె) అని శాస్త్రాలు పేర్కొనడం చేత రాహువు దాదాపుగా శనిలాగానే ప్రవర్తిస్తూ ఆయన ఇచ్చే ఫలితాల్నే తాను కూడా ఇస్తాడు.

అన్ని అంకెల్నీ కూడగా 4 లేదా 8 వచ్చే సంఖ్యలు కూడా ప్రమాదకరమైన సంకేతాలే. అంటే 13, 17, 22, 26, 31 లాంటి తేదీలూ, ఆ నెంబర్లు గల ఇళ్ళూ గదులూ వీధులూ వాంఛనీయం కాదు. అలాగే 35, 40, 44, 53, 62, 71, 103, 107, 202, 206, 301, 305, 400, 404, 503, 602, 701 మొదలైన నెంబర్లు కూడా ! ఇవి మనిషి కంటికి కనిపించని ప్రతీప శక్తుల్ని (negative forces) ని అమితంగా ఆకర్షిస్తాయి. దురదృష్టాల్ని ఆహ్వానిస్తాయి. ముఖ్యంగా- నాలుగో నెంబరు వ్యక్తులూ ఎనిమిదో నెంబరు వ్యక్తులూ వాటిల్లోకి ప్రవేశించినప్పుడూ, ఆ తేదీలు కూడా నాలుగో నెంబరు, ఎనిమిదో నెంబరు అయినప్పుడు ఒక సర్క్యూట్ పూర్తవుతుంది. ఇంక భయంకర విస్ఫోటంతో నేరం జఱగడమే తరువాయి. (నాలుగో నెంబరు వ్యక్తి అంటే ఆ తేదీన పుట్టినవాడు) ఈ నెంబర్లు గల ఇళ్ళకు ఏళ్ళతరబడి పాతకాపులైనవాళ్ళని ఎవరినడిగినా తమ యింట్లో ఒక పెనువిషాదం జఱిగిందని చెబుతారు. కాని అక్కడ ఉండడం మానేస్తే ఆ నష్టం జఱగదు. ఈ నెంబర్లు గల వాహనాలు కూడా మంచివి కావు. కానీ కర్మచాలక అలాంటి

సంఖ్యలు అజ్ఞానులచేత ఆధికారికంగా కేటాయించబడ్డ సందర్భాల్లో ఆ కేటాయిత సంఖ్య పక్కన "అ" అనే తెలుగు అక్షరాన్ని గాని A అనే ఆంగ్ల అక్షరాన్ని గానీ అనాధికారికంగా జతచేర్చుకుని వ్యవహరించడం మూలంగా 90 శాతం కీడు జఱక్కుండా తప్పించుకోవచ్చు.

అలాగే వీథిమూతల (Dead-ends or blind alleys) పక్కనే ఉన్న ఇళ్ళలో నివసించే కుటుంబాల్లో కూడా ఏదో ఒకరోజు ఒక అసాధారణమైన విషాదం చోటు చేసుకోవచ్చు. అది సాధారణంగా వంశనాశనం చేసే రీతిలో ఉంటుంది. అంటే ఆ కుటుంబంలో కనీసం ఒక మగపిల్లవాడు అల్పాయుష్కుడుగా నిస్సంతుగా తొందఱగా చనిపోవచ్చు. ఆడపిల్లలకు ప్రమాదం లేదు.కాని అటువంటి సందర్భంలో వారి తండ్రికి ప్రమాదం ఉంటుంది. అది ఆత్మహత్య ద్వారా కూడా కావచ్చు. ఈ రహస్యం చాలామందికి తెలియదు. అందుచేత హైదరాబాదు నగరం ఇలాంటి వీథిమూతలతో నిండిపోయింది. కాలనీల మధ్య వివాదాలు, వీథిని పొడిగించడానికి నగరపాలకసంస్థ ఒప్పుకోకపోవడం, వేఱే ఏదో ప్రైవేట్-పబ్లిక్ ఆస్తి వీథి చివఱ అడ్డురావడం, భద్రతాభయాలూ, ఏదీ లేకపోతే ఆ వెంచర్‌ని రూపొందించిన రూపశిల్పి (architect) సరదాగా తన డిజైన్‌ని ఇలాంటి వీథిమూతలతో నింపడం వగైరా సవాలక్ష కారణాల వల్ల ఇలా జఱుగుతోంది. చిత్రమేంటంటే వీథిమూతలు చాలా తప్పనే విషయం ఘరానా వాస్తువేత్తలకు కూడా తెలియకపోవడం.

ఇంకా చిత్రమేంటంటే అమెరికాలో ఇలాంటి వీథిమూత ప్లాట్ల కోసం పిచ్చిజనాల వేలంవెఱ్ఱి ! కాస్త అధికం వెచ్చించి మఱీ వాటిని సొంతం చేసుకోవడానికి ఎగబడతారు.అది ప్రైవసీ అట. నిజమే, ప్రైవసీ ! వంశానికే శాశ్వతంగా ప్రైవసీ !

తూర్పాగ్నేయ వీథిశూల ఉన్న ఇళ్ళల్లోను, వాలుగా దించిన పోర్టికోలాంటి నిర్మాణాలతో కొన్ని దిక్కుల్ని మూసివేసిన ఇళ్ళల్లో కూడా హత్యలూ, ఆత్మహత్యల్లాంటి దుర్మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఎవరికి దుర్మరణం ? అనేది సదరు పాడైన దిక్కు మీద ఆధారపడి ఉంటుంది. తూర్పుపాడైతే తండ్రికి హాని. ఉత్తరం పాడైతే తల్లీ, పిన్నమ్మ, పెద్దమ్మ, నాయనమ్మ లాంటివారికి దెబ్బ. దక్షిణం పాడైతే భార్యకు ప్రమాదం. పశ్చిమం పాడైతే పెంపుడు జంతువులు అర్ధాంతరంగా చనిపోతాయి. ఈశాన్యం పాడై తే కొడుక్కి ఉపద్రవం. ఉత్తరవాయవ్యం పాడైతే ఇంటి యజమానే ఇంట్లోంచి వెళ్ళిపోయి ఎక్కడో అనామకంగా కన్నుమూసే అవకాశం ఉంది.

దుర్మరణాలు సంభవించబోతున్నట్లు సకాలంలో - పెద్ద శాస్త్రజ్ఞానం ఉపయోగించకుండానే - ఖచ్చితంగా తెలుసుకునే పద్ధతేమీ లేదా ? అంటే లేకేం ? ఉంది. కానీ ఎక్కువమంది ఆ సూచనల్ని నిర్లక్ష్యం చేస్తారు. మనిషికి భగవంతుడు పంచేంద్రియాలతో పాటు Sixth sense కూడా ఒకటిచ్చాడు. కానీ మనిషి నాగరికతాక్రమంలో అన్ని సహజలక్షణాల్నీ పోగొట్టుకున్నట్లే దాన్నికూడా పోగొట్టుకుంటున్నాడు. పైగా తనకు లేని Sixth sense ఎవరికన్నా ఉంటే వాళ్ళేదో వెనకబడ్డట్లూ sentimental fools ఐనట్లూ, తాను మాత్రం నికార్సైన హేతువాదైనట్లూ ఎగతాళి చెయ్యడం కూడా నేర్చుకున్నాడు. తత్ఫలితంగా భాష, మరియు దానిమీద విపరీతంగా అధారపడ్డ తర్కమనే రంగులరాట్నమూ అనే రెండు కుంటిసాధనాలు మినహాయించి మనిషిలో ఇతరవిధాలైన ప్రతిభలూ, శక్తులూ వికసించడం మానేశాయి.

ఫలితార్థంగా ఇప్పుడేమౌతోందంటే - Sixth sense అనేది ఈరోజు ఆడవాళ్ళల్లోను, జంతువుల్లోను తప్ప మిగతా మానవజాతిలో క్రమంగా మఱుగున పడుతోంది. ఆడవాళ్ళు మగవాళ్ళని అనుకరించడం హెచ్చేకొద్దీ అది వాళ్ళల్లో కూడా అరుదైపోతుంది.

ముఖ్యంగా మత్తుపదార్థాలకూ, త్రాగుడుకూ అలవాటుపడ్డవాళ్లల్లోను, ఎక్కువసార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్నవాళ్ళల్లోను, పాపాలు అపరిమితంగా చేసినవాళ్ళల్లోను Sixth sense నశిస్తుంది.అందుకనే ఆధ్యాత్మిక మహాపురుషులు ఎట్టి పరిస్థితుల్లోను మత్తుపదార్థాల వాడకానికి ఇష్టపడరు. మహాత్మాగాంధి పూర్తి మెలకువలో ఉన్నప్పుడే అపెండిసైటిస్ కి శస్త్రచికిత్స చేయించుకున్నారు. జిడ్డు కృష్ణమూర్తి కూడా అంతే !

Sixth sense ని కోల్పోయిన పర్యవసానమేంటంటే - అది కోల్పోయినవాళ్ళు జరగబోయే విషయాల్ని ముందుగా పసిగట్టలేరు. తమకు తారసిల్లిన అపరిచితుల యొక్క అవాంఛనీయ వ్యక్తిత్వం గుఱించి వాళ్ళ మనసు వాళ్ళని హెచ్చఱించడం మానేస్తుంది. సుదూరంలో ఉన్న తమ ఆప్తులకు అనర్థాలు సంభవిస్తూంటే వాళ్ళకు మాత్రం అందుగుఱించి తమ శరీరంలోనూ, మనసులోనూ ఏ విధమైన ప్రతిచర్యలూ కనిపించవు. కనీసం పీడకలలు కూడా రావు. కళ్ళముందు ప్రత్యక్షంగా జరుగుతున్న విషయాల్లో కూడా లోగుట్టు గ్రహించలేరు. వాళ్ళు ఎంత తర్కాన్ని ఉపయోగించినా మనిషి తర్కం ప్రాథమికంగా గతం, వర్తమానం చుట్టూ మాత్రమే తిరగ్గలదు గనుక వాళ్ళు భవిష్యత్తు గుఱించి ఎవరైనా హెచ్చఱించినా తెలుసుకోజాలరు.

"శ్రీ పెరుంబుదూరులో మీకు ప్రాణహాని ఉం"దని ఆనాటి కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి కీ||శే|| రాజీవ్ గాంధికి సందేశం పంపినా అతను లెక్కచెయ్యకుండా ఆ ఊరికే వెళ్ళాడు, చావుని వెతుక్కుంటూ ! ఇందుకు విరుద్ధంగా హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులతో దాడి జరగడానికి కొన్నిరోజులముందే అక్కడి వీధిజంతువులన్నీ (కొన్ని పెంపుడు జంతువులు కూడా) ఆ నగరాల నుంచి పారిపోయిన సంఘటనని స్థానిక చరిత్రకారులు నమోదుచేశారు. గ్రహణాలు కూడా అంతే ! ఆ సమయంలో జంతువులూ, పక్షులూ ఆహారం కోసం వెళ్ళవు. మఱి వాటికెవడు బోధించాడో ఆస్ట్రానమీ ! తెలియదు.

మనిషిని బతికించేదే అతన్ని చంపుతుంది కూడా ! చావు జీవశక్తుల రూపంలో మన శరీరంలో ఇన్-బిల్ట్. వాటిని మనం యముడు, యమకింకరులూ అనే పేర్లతో పిలుస్తున్నాం. మనిషి చనిపోవడానికి కొన్నిరోజులముందునుంచే అతని శరీరంలోని జీవశక్తులన్నీ బయటికొచ్చి విహరిస్తాయి-ఇల్లు ఖాళీచెయ్యడానికి హడావిడి పడుతున్నవాళ్ళలాగా ! అవి సాధారణంగా పెంపుడు జంతువులకు కనిపిస్తాయి. ముఖ్యంగా కుక్కలకి ! వాళ్ళెవరో ఏమిటో వాటికర్థంకాక గుబులుచెంది అహోరాత్రాలూ ఏడవడం, మొఱగడం చేస్తాయి. మనం వాటిమీద విసుక్కుని కసురుతాం, కొడతాం కూడా ! అంతేతప్ప వాటిద్వారా వ్యక్తమౌతున్న సూచనల్ని గ్రహించం.

ఒక్క విచారకరమైన విషయం. ఆత్మహత్య చేసుకునేవాళ్ళ విషయంలో మాత్రం ఈ సూచనలేమీ ఉండవు.

❖ ❖ ❖ ❖ ❖ ❖

ఆత్మహత్య పర్యవసానాలు -1 :- ఆమె కొన్నివందల సంవత్సరాల క్రితం ఉత్తరభారతదేశంలో ముస్లిమ్ గా జన్మించింది. ఆ రోజుల్లో మంచి సౌందర్యవతి. ఒక సుల్తాను కొలువులో తాను రాజనర్తకిగా పనిచేసేది. ఆమెకొక హిందూయువకుడు పరిచయమయ్యాడు. ఇద్దఱూ ఒకరినొకరు విడిచి ఉండలేనంత గాఢంగా ప్రేమించుకున్నారు. కానీ వారి వివాహం అటూ ఇటూ ఎవరికీ ఇష్టంలేదు. చాలా గొడవలు కూడా అయ్యాయి. అందుచేత అందఱినీ వదిలిపెట్టి ఆ రాజ్యానికి దూరంగా ఎటైనా పాఱి

పోయి పెళ్ళిచేసుకోవాలని, భార్యాభర్తలుగా జీవించాలని వారిద్దఱూ నిశ్చయించుకున్నారు. అలా వారు బయలుదేరి ప్రయాణిస్తూ ప్రయాణిస్తూ పోయి ఒక నది ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ ఆమె ప్రియుడికి స్నానం చెయ్యాలనిపించింది. ఆమెని ఒడ్డునే ఉండమని చెప్పి అతను నదిలోకి దిగాడు. దిగి నాలుగడుగులు లోపలికి వేస్తూనే "అమ్మో ! మునిగిపోతున్నాను. నేను మునిగిపోతున్నాను"అని కేకలు వేశాడు. అతనికి ఈత రాదు. నర్తకి దిగ్భ్రాంతిచెంది చూస్తూండగానే ఆమెకి భర్త కావాల్సినవాడు ఆ విధంగా మునిగిపోయాడు, క్షణాలమీద చనిపోయాడు. నర్తకి కూడా వెనువెంటనే ఆ నదిలోకే దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ ప్రేమకథ అలా అనూహ్యంగా అర్ధాంతరంగా పరిసమాప్తమైంది.

ఆమె మళ్ళీ 1941-42 ప్రాంతంలో ఆంధ్రదేశంలో హిందూస్త్రీగా జన్మించింది. ఆమె పూర్వజన్మప్రియుడేమయ్యాడో తెలియదు. ఆమెక్కూడా ప్రస్తుతం తన పూర్వజన్మ గుర్తులేదు. కాని తన పూర్వజన్మని శోధించడానికి ఆమె జ్యోతిష్కుల్ని అనుమతించింది. ఈ జన్మలో తాను తెలుగుదైనప్పటికీ, తనకి ఉర్దూ ఒక్కముక్క కూడా రాకపోయినా ఆ భాషంటే మటుకు చాలా ఇష్టం. ముస్లిమ్ లను గుఱించిన సినిమాలూ, వారికి సంబంధించిన పాతబడ్డ కోటలూ రాజప్రాసాదాలూ చూడ్డమంటే కూడా చాలా ఇష్టం. ఆ జన్మలో లాగే ఈ జన్మలో కూడా తనకి వివాహం కాలేదు. కారణం ఆమెకీ తెలియదు. ఈ జన్మలో కూడా ఆమె కాస్తో కూస్తో అందగత్తే. అలా అని ఎవరినీ ప్రేమించలేదు. ఆమెని కూడా ఎవరూ ప్రేమించలేదు, పెళ్ళిచేసుకుంటానని ముందుకు రానూలేదు. తల్లిదండ్రులు ఎన్ని సంబంధాలు చూసినా ఒక్కటీ కుదరలేదు. కాని ఆమె బాగా చదువుకుంది. నాట్యమైతే రాదు కానీ అనేక కష్టనష్టాలనుభవించింది.

ఆమె ఈ మధ్యలో ఇంకెక్కడా జన్మలెత్తలేదని భావించబడుతోంది. ఎందుకంటే ఒకానొక భారతీయ జ్యోతిశ్శాస్త్ర పద్ధతి ననుసరించి కనుగొనబడ్డ ఆమె యొక్క తక్షణ పూర్వజన్మల్ని గుఱించిన ప్రశ్నలో పై ఉదంతం మాత్రమే తెలియవచ్చింది. ఈ నడిమి కొన్నివందల సంవత్సరాల వ్యవధానాన్ని ఆమె ఎక్కడ గడిపిందో అంతకాలమూ ఎలా ఉందో తెలియరావడంలేదు. పూర్వజన్మలో ఆమె తన ప్రియుడి మరణానంతరం ఆత్మహత్యకు పాల్పడ్డంలోని ఉద్దేశం (motive) కూడా సరిగా అర్థంకావడంలేదు. ఇంత కష్టపడి ఈ ప్రాచీన సంఘటనకు చేసిన జ్యౌతిషిక పునర్ నిర్మాణం (astrological reconstruction) లో సైతం ఈ విధంగా కొన్ని పూరింపబడని ఖాళీలు మిగిలిపోయాయి. అతను లేని తన జీవితం వ్యర్థమని భావించి ఆత్మహత్య చేసుకోవాలనుకుందా ? లేక చావైనా బతుకైనా ఇద్దఱమూ కలిసే అనుకుని చనిపోయిందా ? లేక దుఃఖోద్వేగంలో నిరాశోపహతస్థితిలో తొందఱపడి నిర్ణయం తీసుకుందా ? జంటగా వెళ్ళినది కాస్తా ఒంటరిగా వెనక్కి రావాల్సిరావడం అవమానకరంగా భావించిందా ? లోకాపవాదేదైనా మీదపడుతుందని భయపడిందా ? తన ప్రియుడు తన కళ్ళముందే మునిగి చనిపోతూంటే చేతగాక చేష్టలుదక్కి చూడాల్సివచ్చి అతనికి ఆ క్లిష్టపరిస్థితిలో ఏ సహాయమూ చెయ్యలేకపోయిన తన అసమర్థతని అసహ్యించుకుని ఒకవిధమైన ఆత్మనిందాభావంతో చనిపోవ నిశ్చయించుకుందా ? ఏది ఏమైనా ఆమె పాల్పడ్డది ఆత్మహత్యకు, ఒక నిషిద్ధపాపానికి ! అయితే సతీసహగమనం శాస్త్రసమ్మతమైనప్పుడు ఆమె చేసింది మాత్రం శాస్త్రవిరుద్ధమెలా అవుతుందనే ప్రశ్న తలెత్తుతుంది. అది ఆత్మహత్య కానప్పుడు ఇది మాత్రం ఆత్మహత్య ఎలా అవుతుంది ? అంటే సతీసహగమనం కూడా ఆత్మహత్యే. అది పుణ్యం కాదు, పాపమే. సతీసహగమనం యొక్క మూలాల్ని శోధించినప్పుడు బయటపడే విషయమిది. ఆ ప్రస్తావన ఇక్కడ ప్రసక్తం (relevant) కాదు కనుక ఇంతకంటే ఎక్కువ రాయలేను.

ఆత్మహత్య చేసుకున్నవారు చనిపోయాక పిశాచాలవుతారు. కనుక ఆమె చనిపోయాక పిశాచమై కొన్నివందల సంవత్సరాలు

అలాగే ఉండిపోవడం చేత ఈ మధ్యలో జన్మలెత్తలేకపోయి ఉండొచ్చు. పిశాచజన్మ సాంకేతికంగా లోకాంతరం కావడానా, మానవలోకంతో సంబంధం లేనిదిగా భావించడం మూలానా అది పూర్వజన్మప్రశ్నలలో కనిపించడం అరుదు. అందువల్లనే ఆమెయొక్క తక్షణ పూర్వజన్మ గుఱించిన ప్రశ్నలో ఆనాటి రాజనర్తకి జన్మ ఒక్కటే తెలియవస్తూండి ఉండొచ్చు. ఈ జన్మలోని కష్టాలక్కూడా ఆనాటి ఆత్మహత్యాపాపం కొంతవఱకు కారణం కావచ్చు. "జన్మజన్మలకూ నువ్వే నా భర్తవి" అంటూ ప్రేమమైకంలో చేసిన భావోద్వేగపూరితమైన, హృదయపూర్వకమైన ప్రతిజ్ఞల వల్ల ఈ జన్మలో కూడా భర్త లభించకపోయి ఉండొచ్చు.

లౌకికదృష్టితో చూస్తే ఇద్దఱూ ఒక్కసారే, ఒక్కలాగే చనిపోయినట్లు అనిపిస్తుంది. కాని ఆ రెండు చావులకూ మధ్య చాలా తేడా ఉంది. అతను బతికి బావుండాలనుకున్నాడు. ఆమెని పెళ్ళి చేసుకుని ఆనందంగా జీవించాలనుకున్నాడు. కాని అలా అర్థాంతరంగా చనిపోవాల్సి వస్తుందనుకోలేదు. కాని ఇంకొన్ని గంటల్లో తమ వివాహం అయిపోతుందనగా అతను అనివార్యంగా చనిపోయాడు. అందువల్ల అతను పుట్టుకతోనే అల్పాయుష్కుడయ్యుంటాడని తోస్తుంది. ఆ రకంగా అతను ఇఱుక్కున్న జలగండం విధినిర్ణయం. అందుచేత అతనిది అకాలమరణమే గాని అసహజ మరణం కాదు. అతనికి చనిపోయాక వేఱేచోట జన్మించే యోగం రాసిపెట్టి ఉంది. అతన్ని నర్తకి పెళ్ళిచేసుకోవడమూ అంత త్వరలో విధవరాలుగా మారడమూ దేవుడికి అభిమతం కాదు. అందుకనే ఇంకొన్ని గంటల్లో వాళ్ళిద్దఱూ పెళ్ళిచేసుకుంటారనగా అతన్ని ముందుగానే తీసుకెళ్ళిపోవడం. కాని నర్తకి సంగతి అలా కాదు. అయితే ఆ సమయంలో ఆమె కూడా అతని మనీష (mood)లోనే ఉంది. మఱి జఱిగినదాన్ని బట్టి చూస్తే మాత్రం ఆమెకి ఆ జన్మలో వివాహయోగం ఉన్నట్లు తోచదు. ప్రియతముల దుర్మరణాన్ని ఆసాంతం కళ్ళారా చూసిన వాళ్ళు ఒక జీవితకాలానికి సరిపడా దిగ్భ్రాంతికి లోనౌతారు. వాళ్ళు మళ్ళీ పూర్తిగా పూర్వపు మనుషులయ్యేది కల్ల. ఆ రకంగా ఆమె అతని మరణానంతరం వెనక్కి వెళ్ళిపోయి ఇంక ప్రేమలూ పెళ్ళిళ్ళ లాంటి తగలాటాలేం పెట్టుకోకుండా అతని గతస్మృతుల నీడలో ఒంటరిగా జీవించే యోగం బహుశా రాసిపెట్టి ఉంది. కాని ఆ నొసటిరాతకి వ్యతిరేకంగా ఆమె భగవంతుడిపై తిరగబడింది. తన దయనీయమైన దురదృష్టానికి అక్కడికక్కడే నిలువునా అధోపాతాళానికి క్రుంగిపోయింది. ఆ భంగపాటులో ఆత్మహత్య చేసుకుంది.

ఏ బాధల నుంచి తప్పించుకోవాలని మనుషులు ఆత్మహత్య చేసుకుంటారో వాళ్ళు మళ్ళీ పుట్టి సరిగ్గా అవే బాధల్ని అంతే స్థాయిలో అనుభవించాల్సి వస్తుంది. ఆవార మిగిలిన ఆయుర్దాయం మళ్ళీ అదే బాధానుభవం కోసం మళ్ళించబడుతుంది. అందువల్ల ఆత్మహత్యతో ఆశించిన ప్రయోజనం నెఱవేఱదు. ఉదాహరణకి - ఎయిడ్స్ సోకిందని ఆత్మహత్య చేసుకున్నవారు మళ్ళీ పుట్టి, లేదా అసలింకా పుట్టకముందే తల్లిగర్భంలో ఉండగానే ఆ రోగం సంక్రమించవచ్చు. అదే విధంగా ఆత్మహత్య చేసుకున్న నర్తకి ఈ జన్మలో కూడా జీవితాంతం అవివాహితగా ఉండిపోవాల్సివచ్చింది.

❖ ❖ ❖ ❖ ❖ ❖

ఆత్మహత్య పర్యవసానాలు-2 : *(ఈ ఉదంతంలో పేర్కోబడుతున్న వ్యక్తులు ఇంకా జీవించే ఉన్నారు కనుక వారి గోప్యత నిమిత్తం వారి పేర్లని స్వల్పంగా మార్చడమైనది)*

(క్రీ.శ.1980-90) ఎమ్.రామభద్రం వాళ్ళ నాన్న అప్పారావు ఆ రోజుల్లో గుంటూరు పోలీసు శాఖలో కానిస్టేబుల్. వాళ్ళు గుంటూరులో సంపన్నులు నివసించే నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ క్వార్టర్సులో ఉండేవారు. నగరంపాలెం కట్టుదిట్టమైన భద్రతా బందోబస్తులు గల ప్రాంతం. గుంటూరు జిల్లాకి సంబంధించిన పరిపాలనా యంత్రాంగం యావత్తూ అక్కడే కేంద్రీకృతమై ఉంది. ఆ క్వార్టర్సులోనే భోజేశ్వరి అనే ఒక తెలివైన చలాకీ పిల్ల ఉండేది. ఆమే, హుస్సేన్ అనే ఒక తెలుగు ముస్లిమ్ యువకుడూ ప్రేమలో పడ్డారు. ఈ వ్యవహారం చాలా నెలలపాటు నడిచింది. తరువాత అతనికి వేఱేచోట ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడు. అయినా మధ్యలో అప్పుడప్పుడు గుంటూరు వచ్చి ఆ పిల్లని కలిసి వెళ్ళేవాడు. ఈలోగా అతని తల్లిదండ్రులు అతనికొక ముస్లిమ్ సంబంధం చూశారు. వాళ్ళింట్లో, వాళ్ళూ వాళ్ళూ ఏం మాట్లాడుకున్నారో మఱి, మొత్తం మీద భోజేశ్వరిని మర్చిపోయి తన కులం అమ్మాయిని చేసుకోవడానికి హుస్సేన్ అంగీకరించాడు. పెళ్ళి ఏర్పాట్లన్నీ శరవేగంతో జరిగిపోయాయి. శుభలేఖలు కూడా అచ్చేశారు. మర్నాడు పెళ్ళి అనగా హుస్సేన్ బావుండదనుకున్నాడో ఏమో భోజేశ్వరికి ఫోన్‌చేసి తన పెళ్ళి విషయం చెప్పేశాడు. తన పెళ్ళికి తప్పకుండా రావాలని కూడా ఆహ్వానించాడు. "అందరికీ వ్యక్తిగతంగా శుభలేఖలిచ్చి ఇంతకాలంపాటు స్నేహం చేసినదాన్ని నాకు మాత్రం ఇంత ముఖ్యమైన విషయం ఫోన్‌లోనా చెప్పేది ?" అని నిష్ఠూరమాడింది భోజేశ్వరి. "సరే ! స్వయంగా వచ్చి శుభలేఖ ఇస్తాలే."అన్నాడు హుస్సేన్. అన్నప్రకారంగానే మఱో గంటలో భోజేశ్వరివాళ్ళ ఇంటిముందు ప్రత్యక్షమయ్యాడు. ఆమె సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టింది. శుభలేఖ తీసుకుని అభినందనలు చెప్పింది. "చివఱిసారిగా నేనిచ్చే కాఫీ తాగవా ?" అని అడిగింది. సరేనన్నాడు హుస్సేన్, భోజేశ్వరి వాలకం చూసి హాయిగా ఊపిరి పీల్చుకుంటూ. అక్కడున్న వార్తాపత్రిక తీసి తిరగెయ్యసాగాడు. వంటగదిలోకి వెళ్ళిన భోజేశ్వరి బయటికొచ్చింది, అగ్నిదేవతలా ఒంటినిండా కిరోసినాయిల్ వాసనతో నిలువెల్లా నాలుకలు సాచిన జ్వాలలతో భగభగ దహించుకుపోతూ చడీ చప్పుడూ లేకుండా అతని దగ్గఱికొచ్చి మీదపడి అతన్ని గట్టిగా పట్టుకుని వాటేసుకుంది. వార్తాపత్రిక చదువుకుంటున్న హుస్సేన్ ఒక జీవితకాలపు దిగ్భ్రాంతిని పొందాడు. ఆ వచ్చినదీ, దహించుకుపోతున్నదీ, తనని పట్టుకున్నదీ ఎవరో అతనికి చప్పున అర్థంకాలేదు. "భోజేశ్వరీ ! భోజేశ్వరీ !"అని సహాయం కోసం పిలుస్తూ పెనుగులాడుతున్నాడు. కాలిపోతున్న భోజేశ్వరి "నేనే...నేనే...భోజాన్ని" అంటూ కాలిపోతోంది. ఆ గొంతు విన్నాక అసలు విషయం అర్థమైంది హుస్సేన్‌కి. ఆమెనుంచి ఎలానో తప్పించుకుని ఆమె గడియపెట్టి ఉంచిన తలుపుని తెఱుచుకుని బయటికి పరిగెత్తాడు. అతని ఒళ్ళు కూడా కొంత కాలింది. అతన్ని పొరుగువాళ్ళు వెంటనే ఆస్పత్రికి తరలించారు. భోజేశ్వరి అక్కడికక్కడే సజీవంగా కాలి బొగ్గైపోయింది. హుస్సేన్ పెళ్ళి వాయిదాపడింది కాని నెలరోజుల చికిత్స అనంతరం అతను శారీరికంగా మళ్ళీ మామూలు మనిషయ్యాడు.

రామభద్రం వాళ్ళ నాన్న ఆరోజుల్లో రాత్రిపూట విధినిర్వహణలో పడి ఇంటికి ఆలస్యంగా వచ్చి భోజనం చేసేవాడు. ఆయనకొక విచిత్రమైన అలవాటు ఉండేది. అదేమిటంటే రాత్రిపూట పెరుగన్నం తినడం. భోజేశ్వరి చనిపోయిన 15 రోజులకి ఆయన యథాప్రకారం రాత్రి 11 గంటలకు ఇంటికొచ్చేసరికి ఇంట్లో పెరుగు లేదు. నగరంపాలెం కలక్టరాఫీసు దగ్గర ఒక హొటల్లో రోజూ 24 గంటలూ పాలూ, పెరుగు అమ్ముతారు. భారతీయ నగరాల్లో ఇలాంటి 24-గంటల సేవలు చాలా మామూలు విషయం. నిద్రపోతున్న వేళలో తనని తండ్రి ఇలా లేపి ఏదో ఒక పనికి పంపడం రామభద్రానికి కొత్త కాదు. అందుచేత ఒక స్టీలు టిఫిన్ డబ్బా పట్టుకుని పెరుగు తేవడం కోసం గుంటూరు జిల్లా కలెక్టరాఫీసు దగ్గఱికి బయలుదేరాడు. నగరంపాలెం ఒక విలాస వంతమైన ప్రాంతం (posh area) కావడం చేత ఆ రోడ్లన్నీ అర్ధరాత్రివేళ కూడా పట్టపగల్లా ధగద్ధగాయమానంగా మెఱిసిపోయేలా అధికారులు శ్రద్ధ వహిస్తారు. రామభద్రం ఈలవేసుకుంటూ పాటపాడుకుంటూ ఆ నిర్జన రహదారికున్న సువిశాలమైన పేవ్‌మెంట్ (సైడ్‌వాక్) మీద నడుస్తున్నాడు. ఆ సైడ్‌వాక్ పక్కన గాలికి చిఱుసవ్వడితో ఊగుతున్న అవెన్యూ ప్లాంటేషన్ వెనుకనుంచి "భద్రం !" అనే

నెమ్మదైన ఆడగొంతు పిలిచిన పిలుపు వినపడింది. ఈ సమయంలో ఈ రోడ్డుమీద ఆడవాళ్ళెవరా ? అనుకుంటూ రామభద్రం పక్కకి తిరిగి చూశాడు. ఆ చెట్టు వెనక విద్యుద్దీపాల నీడల్లో ఎఱ్ఱటి చింతనిప్పుల్లాంటి కళ్ళతో అదే చిఱునవ్వుతో-

ఆమె...ఆమె...భోజేశ్వరి ! సరిగ్గా 15 రోజుల క్రితం కాలిపోయి చచ్చి బూడిదైన భోజేశ్వరి !!

❖ ❖ ❖ ❖ ❖ ❖

ఆమె చనిపోయిన విషయం గుర్తొచ్చిన రామభద్రానికి తానిప్పుడు చూస్తున్నది భోజేశ్వరి ప్రేతాత్మనన్న విషయం స్పష్టంగా ఆకళింపైపోయింది. భయంతో కళ్ళు పెద్దవిచేసుకుని నోరు తెఱుచుకుని నిశ్చేష్టుడై ఆమెవంక చూస్తున్నాడు. "ఎందుకు భద్రం భయపడుతున్నావ్ ?" అని భోజేశ్వరి నవ్వుతూ గాలిలో కలిసిపోయి అంతర్ధానమైంది. అంతే ! పెరుగూ విరుగూ అన్నీ మర్చిపోయి రామభద్రం ఇంటికేసి పరుగో పరుగు. ఇంట్లోకి రాకముందే మెట్లదగ్గఱే పడిపోయాడు. అసలు తాను ఇంటికెలా చేఱుకున్నాడో తనకే తెలియదు. అందరూ ఆందోళనతో అతన్ని లేవదీసి లోపలికి మోసుకెళ్ళారు. ఎలా వచ్చిందో గాని అప్పటికప్పుడు 102 డిగ్రీల మాయదారి జ్వరం, రామభద్రం మూసిన కన్ను తెఱవకుండా మూడ్రోజులు పడుకున్నాడు.

ఒంట్లో కాస్త కులాసా చిక్కింతర్వాత తాను చూసినది ఉన్నదున్నట్లు చెబితే ఎవ్వరూ నమ్మలేదు. వాళ్ళ నాన్న అప్పారావు చాలా సంవత్సరాల్నుంచీ నైట్ డ్యూటీలకెళుతున్నాడు. ఆయనకెప్పుడూ ఏ దెయ్యాలూ ఎదురుకాలేదు. అందుకని ఆయన కలాంటి నమ్మకాలేమీ లేవు. "పిఱికి నా కొడకా ! దేన్నో చూసి ఏదో అనుకుని బాగా జడుసుకున్నావులే గాని, ఇంక నోర్మూయ్యెహె !"అని కసిరాడు. తండ్రికి తగ్గ కొడుగ్గా రామభద్రానికీ పెద్దగా నమ్మకాల్లేవు. కాని తాను భోజేశ్వరి ప్రేతాత్మని చూసింది నిజమనీ, అందులో అబద్ధమేమీ లేదనీ, తానేమీ భ్రమపడలేదనీ అతను పలుమార్లు నొక్కివక్కాణించేవాడు. ఆమె ఇతనికెందుకు కనిపించిందో తెలియదు. ఏదేమైనా భోజేశ్వరి మరణానంతరం అతనిక్కనిపించడం అదే మొదటిసారి, అదే చివరిసారి కూడా !

జీవి శరీరంలో ఒక మెదడుందని మనమందరం అనుకుంటాం. వాస్తవానికి ఒక్కొక్క అవయవానికి ఒక్కొక్క మెదడుంది. ఆ మెదళ్ళన్నీ ఒక కేంద్ర మెదటికి లోబడి పనిచెయ్యడం వేఱే విషయం. తద్ద్వారా కేంద్రమెదటికి (పరమాత్మస్వరూపమైన) జీవాత్మ అధిష్ఠానమైనట్లే ఆయా చిఱుమెదళ్ళక్కూడా వేఱువేఱు అధిష్ఠానదేవతలున్నారు. ఉదాహరణకు చేతులకు ఇంద్రతేజస్సు అధిష్ఠానదేవత. కుడిచెవికి పవిత్రనదులు అధిష్ఠానదేవతలు. మర్మాంగానికి ప్రజాపతులు అధిష్ఠానదేవతలు. వృషణాలకు పితృదేవతలు అధిష్ఠానం. ఆయా అధిష్ఠానదేవతలు ఆయా అవయవాల్లో నిత్యనివాసం చేస్తారు. వాళ్ళు మనిషి పుట్టకముందే దైవాదేశం మేఱకు అతని/ఆమె అవయవాల్లో తిష్ఠవేస్తారు. వాళ్ళని భౌతికశరీరంలో కాక అందులో ఉన్న సూక్ష్మశరీరంలో మాత్రమే దర్శించగలుగుతాం. ఆ కారణం చేతనే *"దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవస్సనాతనః"* (ఈ దేహమే పవిత్రమైన దేవాలయం. ఇందులో నివసించే జీవుడే నిత్యుడూ, సత్యుడూ అయిన సనాతన భగవంతుడు) అని మన పూర్వీకులు మొత్తుకున్నది. అలాగే చావు సమీపించినప్పుడు దైవాదేశం మేఱకు ఆయా దేవతలు (జీవశక్తులు) తమంతట తాముగా శరీరాన్ని విడిచి వెళతారు. కాని వారు మృతశరీరంలోని పంచభూతాల్లాగా చెల్లాచెదఱు అవ్వరు. వారు సూక్ష్మశరీరాన్ని లోకాంతరాలకూ జన్మాంతరాలకూ తరలిస్తారు. దాన్తో పాటే ఉంటారు. అవి గతజన్మలకు చెందిన పాత కర్మఫలాల యొక్కా, జ్ఞాపకాల యొక్కా దస్తావేజుల్ని జన్మనుంచి జన్మాంతరానికి మోసుకెళతారు.

నిజానికి జన్మలెత్తేది ఆత్మ కాదు, సూక్ష్మశరీరమే. మనుషులు మేల్కొన్న స్థితిలో "నేను, నాది" అని వ్యవహరించేది కూడా దాన్నే. జనం దాన్ని "ఆత్మ" అని వ్యవహరించడం కేవలం భ్రమప్రమాదజనితం. శుద్ధపొఱపాటు మాత్రమే. ఆత్మస్థితిలో "నేను, నాది" ఉండవు. ఆత్మకు జన్మలూ, చావులూ, సుఖదుఃఖాలూ, ధర్మాధర్మాలూ, పాపపుణ్యాలూ, శుభాశుభాలూ, దేశకాలాలూ ఏమీ లేవు. అది ఒక దేహానికీ, ఒక మతానికీ, ఒక లోకానికీ పరిమితం కాదు. జీవులూ-జడాలూ, కుర్చీలూ-బల్లలూ, రాయీ-రప్పా, చెట్టూ-పుట్టా అన్నింట్లోను ఉండే సర్వాతీత సర్వాంతర్యామి ఆత్మ. అది అస్తిత్వానికే అస్తిత్వం. దానికే దేవుడని నామాంతరం.

ఎందుకు చెబుతున్నానంటే - ఆత్మహత్య చేసుకున్నవాళ్ళు తమ శరీరంలోని అధిష్ఠాన దేవతల్ని అకాలంగా బలవంతంగా వెళ్ళగొడతారు. దైవాదేశం లేకపోవడం చేత ఆ దేవతలు వెళ్ళడానికి ఇష్టపడరు. కాని నశించిపోతున్న శరీరంలో ఉండడం సాధ్యపడదు. సదరు దేహం సహజంగా నిర్ణీత సమయానికి పతనమయ్యేటప్పుడు దాని పాత ఫైళ్ళని సజావుగా ప్రశాంతంగా ఇంకో జన్మకు బదిలీ చెయ్యడానికి వాళ్ళు నియమించబడ్డారు. ఆ ఫైళ్ళలో గతజన్మల పాపాలూ, పుణ్యాలూ, జ్ఞాపకాలూ, వాటికి నిర్ణయించబడ్డ ఫలితాలూ అన్నీ ఉంటాయి. దైవద్రోహియైన జీవుడితో కలిసి ఉండడానికి వాళ్ళకిష్టం లేకపోవడంతో ఆ ఫైళ్ళు పట్టుకుని వాళ్ళు తమ లోకాలకు తాము వెళ్ళిపోతారు. తిరిగి దైవాదేశం వచ్చేదాకా ఆ దైవద్రోహి శరీరంలో ప్రవేశించడానికి వాళ్ళు సాహసించరు. ఇంక మిగిలేది ఏమిటి ? అంటే ఏ అధిష్ఠానదేవతలూ లేనటువంటి పాడుపడ్డ దేవాలయంలాంటి దైవద్రోహపు సూక్ష్మశరీరం. దాన్ని సామాన్యులు "దెయ్యం/ పిశాచం" అని వ్యవహరిస్తారు. అధిష్ఠాన దేవతలు గతం తాలూకు అన్ని ఆనవాళ్ళూ తమవెంట తీసుకెళ్ళిపోవడంతో జీవి తన సర్వస్వాన్నీ పోగొట్టుకుని రోడ్డున పడ్డ పరమబికారి దివాలాకోరులా మారిపోతాడు/మారిపోతుంది. దేవుడికి దూరమైపోవడం మాట సరేసరి. అంతకుముందటి జన్మల్లో చేసిన అమూల్యమైన, మహోజ్జ్వలమైన పుణ్యఫలాలు చాలావఱకు రద్దయిపోతాయి. అదొక భయంకరమైన పరిస్థితి. చచ్చీచెడీ ఏడాదిపాటు చేసిన ప్రాజెక్టు మొత్తం నిశ్శేషంగా క్రాష్ అయిపోయే సంభావ్యతని ఊహించుకోండి. కోట్లల్లో మీరు డిపాజిట్లు పెట్టిన బ్యాంకు ఆకస్మికంగా మూతపడిపోయాక దాన్ని తిరిగి ఎప్పుడు తెఱుస్తారో మీ డబ్బు మీకెప్పుడు చేతికందుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడితే మీ అవస్థ ఎలా ఉంటుందో యోచించండి !

బతికున్న రోజుల్లో సంపాదించుకున్నపుణ్యఫలం అపారంగా ఉన్నప్పటికీ ఆత్మహత్య చేసుకుంటే మాత్రం పిశాచజన్మ తప్పదు. ఇందుకు కొన్నిసార్లు దైవక్రోధం కారణం కాగా, మఱికొన్నిసార్లు ఆయనకి ఏ కోపమూ లేకపోయినా పిశాచజన్మే ఇస్తాడు. అది తప్ప వేఱే గత్యంతరం లేని పరిస్థితిని ఆయనకు ఆత్మహంతకులు కల్పిస్తారు. కారణం ఏంటంటే - దేవుడికి సంబంధించినంత వఱకు ఈ ప్రపంచంలో నిజంగా వ్యర్థుడూ, పనికిమాలినవాడూ ఎవడూ లేడు. అందరూ ఆయనకు ఏదో ఒక రకంగా పనికొచ్చే వాళ్ళే. చిన్నదో-పెద్దదో, మంచో-చెడ్డో ప్రతివాడికీ ఆయన తన జగన్నాటకంలో ఒక పాత్ర ఇచ్చి దాన్ని సక్రమంగా పోషించమని భూలోకంలోకి పంపిస్తాడు. ఇక్కడ మన సన్నిధానంలో జఱగాల్సిన సంఘటనలున్నాయి. మనమీద మనకు తెలియకుండా ఆధారపడే మనుషులున్నారు. మనం ఆత్మహత్య చేసుకుంటే మన స్థానాన్ని నిజంగా మనలాసే భర్తీచెయ్యగల వాళ్ళెవ్వరూ లేరు. మనం కేవలం పాత్రధారులమే కనుక మనకిందులో లోతుపాతులు పెద్దగా అర్థంకావు. సమాజం దృష్టిలో ఒకడు పోతే మఱొకడు (No one is indispensable, they say.). కాని దేవుడి దృష్టిలో కాదు. ఒక అప్పారావుకు ఇంకో సుబ్బా రావు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాడు. ప్రతివాడూ ఒక విశిష్టవ్యక్తి (unique personality). అందుచేత ప్రజాస్వామ్యాలూ,

ప్రజాభిప్రాయాలూ, గణాంకాలూ (statistics) ఆయనకి గడ్డిపోచతో సమానం. ఆయన మనుషుల్ని గుంపులుగా కాక వ్యక్తులుగా చూస్తాడు. పైపైన కాక లోలోపలికి తొంగిచూస్తాడు. ఆ తీఱికా, ఓపికా, నేర్పూ ఆయన కొక్కడికే సొంతం.

కాబట్టి ఒక మనిషి ఆత్మహత్య చేసుకున్నప్పుడు ఏం జఱుగుతుందంటే - ఆ చర్య దేవుడి ప్రణాళికలో భాగం కాకపోవడంతో అతనికి/ ఆమెకు వెంటనే మానవజన్మనివ్వడం ఆయనకు ఇబ్బందికరంగా మారుతుంది. ప్రపంచంలో 330 కోట్లమంది ఆడవాళ్ళు ఉన్నప్పటికీ, మానవజన్మెత్తాలని ఆత్రంగా కాచుక్కూర్చున్న ఆత్మల సంఖ్యతో పోలిస్తే అందుబాటులో ఉన్న మానవ గర్భాల యొక్క వాస్తవసంఖ్య చాలా పరిమితమైనది. అవి వందేళ్ళ క్రితమే, వందేళ్ళకంటే ముందే రకరకాల వ్యక్తులకు కేటాయించబడి ఉంటాయి. వీటిల్లో ఎక్కడో ఒకచోట ఉన్నపళాన ఆత్మహంతకుల్ని ఇఱికించడం ఆయనక్కూడా సాధ్యపడదు. అసలు ఆయన వాళ్ళగుఱించి అంత తీవ్రంగా ఆలోచించాలంటే తమ జీవితంలో ఆయనకు ఏదో ఒక సేవా, ప్రార్థనా చేసి ఉన్న చరిత్ర వాళ్ళకు ఉండాలి కదా ! ఆయనకు ఎంత దయ ఉన్నప్పటికీ అంతిమంగా గర్భాన్ని మొయ్యాల్సింది ఆడది కనుక ఆమె అందుకు సరిపోతుందో లేదో, ఆమెకి ఇలాంటిది ఇష్టమౌనో కాదో కూడా ఆయన చూస్తాడు. అరుదుగా అలాంటి ఆడది దొరికినప్పుడు ఆమెకి ఒకే కాన్పులో ముగ్గుఱిని, నలుగుఱినీ, ఐదుగుఱినీ కూడా ప్రసాదించేస్తాడు. ఆయన ఒకణ్ణి పుట్టించాలంటే అంతకుముందే చాలా పూర్వరంగాన్ని ఏర్పాటుచేసుకోవాలి. ఒక వైద్యుణ్ణి పుట్టించాలంటే కనీసం వెయ్యిమంది రోగుల్ని కూడా పుట్టించాలి. ఒక పోలీసుని పుట్టించాలంటే కనీసం ఒక వందమంది నేరస్థుల్ని కూడా పుట్టించాలి. ఇది కేవలం మనుషుల సంగతి. ఇతర జీవజాలం సంగతి ఇందుకు కొన్ని లక్షల రెట్లు సంక్లిష్టం. దీన్ని ఆయన మాత్రమే నిర్వహించగలడు. అలాంటి భగవంతుణ్ణే అయోమయంలోకి నెట్టేస్తాడు బుద్ధిహీనుడైన ఆత్మహంతకుడు. తత్ఫలితంగా ఆయన ఆత్మహంతకులకు పిశాచజన్మ ఇచ్చి వాళ్ళ ఆత్మహత్యాపాతకం పరిహారమయ్యేదాకా, పునర్జన్మకి పరిస్థితు లనుకూలించేదాకా వేచిచూస్తాడు. ఆ అనుకూల పరిస్థితులు ఏర్పడ్డానికి వందేళ్ళు పట్టొచ్చు, వెయ్యేళ్ళు పట్టొచ్చు, పదివేలేళ్ళు కూడా పట్టొచ్చు. ఇదొక loop-line గా, waiting list గా భావించవచ్చు. పుట్టగతులు (మళ్ళీ పుట్టడానికి మార్గాలు) లేకపోవడమంటే ఇదే.

అనాథలైన వీధిపిల్లల్ని పోగేసి వాళ్ళతో భిక్షమెత్తించే నేరస్థ ముఠాలున్నట్లే - ఇలా ఆత్మహత్యలకు పాల్పడి దైవబలాన్ని కోల్పోయి పిశాచరూపాన్ని పొందిన మానవాత్మల్ని వెతికిపట్టుకుని, క్షుద్రమంత్రాలతో బంధించి, వాటికేవో భౌతికానుభవాల్ని ఎఱగా వేసి తమ యొక్క నీచకార్యకలాపాలకు వాటిని వాడుకునే దుర్మార్గులు ఉన్నారు. వాళ్ళు ఇప్పటికీ మన సమాజంలో రహస్యంగా సంచరిస్తున్నారని మర్చిపోవద్దు. వాళ్ళని తక్కువ అంచనా వెయ్యొద్దు. కొన్నికొన్ని పిశాచాల్ని తమకప్పగించవలసిందిగా వాళ్ళు పిశాచాలకు రాజైన బేతాళుణ్ణి ఆవాహన చేసి ప్రార్థిస్తారు. అలా...అలా... ఒకసారి ఆత్మహత్యచేసుకున్న జీవి పరిస్థితి రోజురోజుకీ దారుణంగా దిగజాఱిపోతూ ఉంటుంది. కనుచూపు మేఱలో దాన్నుంచి విముక్తి కనిపించదు. అలా గత 400 సంవత్సరాల నుంచి పిశాచాలుగానే మిగిలిపోయినవాళ్ళున్నారు. ఆ ప్రస్తావన ఇక్కడ సందర్భ సహితం కాదు. ఐతే పిశాచత్వం గుఱించిన నా పరిశోధన వివరాల్ని ఎప్పుడో ఒకప్పుడు ఈ **(కలగూరగంప)** బ్లాగులో ఇలాగే వరుస-టపాలుగా ప్రకటిస్తాను.

చచ్చే ధైర్యమున్నప్పుడు బతికే ధైర్యం కూడా ఉండాలి. *(సమాప్తం)*

--తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం (2007)

http://www.tadepally.com